


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

02.08.2026

ఆదివారం |రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 33

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## భోగాపురంతో ఉత్తరాంధ్రకు

# కొత్త ఊపు



### భోగాపురం ఎయిర్‌పోర్ట్ జాతికి అంకితం: మోదీ

రూ.18,000 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

ఉత్తరాంధ్ర వికాసానికి కొత్త రన్‌వే: మోదీ

అల్లూరి పేరుతో విమానాశ్రయానికి గౌరవం

ఉడాన్‌తో సామాన్యులకు విమాన ప్రయాణం

ఏపీ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోంది: మోదీ

భోగాపురం, ఆగస్టు 01,
అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా జాతికి అంకితం చేశారు. దీనితో పాటు రాష్ట్ర సమగ్ర పురోగతికి ఊతమిచ్చే రూ.18,000 కోట్ల విలువైన వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని అందరికీ నమస్కారం అని తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. సింహాచలం అప్పన్న స్వామికి, విజయనగరం పైడితల్లి అమ్మవారికి శిరస్సు వంచి ప్రణామాలు సమర్పించారు. 2లో..



### ఉత్తరాంధ్ర ఇకపై ఉత్తమ ఆంధ్ర

- సీఎం చంద్రబాబు నాయుడు
- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం
- రాష్ట్ర పునర్నిర్మాణ హామీ నెరవేర్చాం
- ఉత్తరాంధ్రలో 8 ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి

భోగాపురం, ఆగస్టు 1,
అనంత జనశక్తి న్యూస్

ఉత్తరాంధ్ర ఇకపై అభివృద్ధిలో ఉత్తమ ఆంధ్రగా ఉండబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్ర దశదిశ మారబోతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టేననని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 7లో..



### క్షమించే గుణం మోదీది

- దూషించే వారిని కూడా క్షమిస్తారు
- డిప్యూటీ సీఎం పవన్

తెలుగుజాతి ఎవరికీ తలవంచదు 2లో..

### ఎర్రబస్సు రాని చోట ఎయిర్‌బస్సు

- ఇదే ఉత్తరాంధ్ర దెబ్బ: మంత్రి లోకేష్ వెల్లడి
- వికసిత్ భారత్‌కు భోగాపురం ప్రతిరూపం
- ఏపీ గ్రోత్ ఇంజన్‌గా ఉత్తరాంధ్ర 7లో..



## స్వాతంత్ర్యం అంటే అది కాదు!

- జెన్ జీ నిరసనల నేపథ్యంలో..
- ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ, ఆగస్టు 01,
అనంత జనశక్తి న్యూస్

నీట్ పేపర్ లీక్‌పై జెన్ జీ నిరసనల నేపథ్యంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం అంటే ఇష్టారీతిన వ్యవహరించగలిగే అపరిమిత స్వేచ్ఛ కాదని అన్నారు. పూణెలో హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు స్వీకరించిన అనంతరం డోభాల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 2లో..

## ఏడాదిలో 10.23 శాతం వృద్ధి

- 2025-26 ఆర్థిక సంవత్సరంలో
- రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931
- సీఎం రేవంత్ కామెంట్
- కొత్త శిఖరాలకు తెలంగాణ రైజింగ్
- గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగింది
- తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని కామెంట్



హైదరాబాద్, ఆగస్టు 01,
అనంతజనశక్తి న్యూస్

తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. 2లో..

### రీల్స్‌లోనే క్షమిస్తారా.. కేసులూ ఎత్తేస్తారా..?

- ప్రధాని మోదీకి సీజేపీ అధినేత అభిజీత్ ప్రశ్న



2లో..

న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్

విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## ఫేక్ న్యూస్‌పై కేటీఆర్ ఫైర్

- ఫేక్ న్యూస్‌ను ఫ్యాక్ట్ చెక్ చేయాలి: కేటీఆర్
- ప్రగతి భవన్‌పై తప్పుడు ప్రచారం జరిగిందని ఆరోపణ
- కాళేశ్వరం కుంభకోణ ప్రచారం ఫేక్ న్యూస్ కాదా? అని ప్రశ్న
- సోషల్ మీడియా వల్ల జవాబుదారీతనం వచ్చిందని వ్యాఖ్య
- జెన్‌జీ దెబ్బకు మోదీ అర్ధరాత్రి వీడియో పెట్టారని కేటీఆర్ విమర్శ

2లో..



హైదరాబాద్, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్

సోషల్ మీడియా ద్వారా ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మీడియాలో, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వస్తే అవును తప్పకుండా (ఫ్యాక్ట్ చెక్) నిజాలను నిర్ధారించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు.

### ఎర్రబస్సులు కాదు.. ఎయిర్ బస్‌లు తిరిగే ప్రాంతం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు 2లో..



భోగాపురం, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్

ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎర్ర బస్సులు కాదు.. ఎయిర్ బస్‌లు తిరిగే ప్రాంతమని నిరూపించామన్నారు.

## ఒక్కరోజులో రికార్డు స్థాయిలో 2.20 లక్షల లావాదేవీలు

- మీసేవలో చరిత్రాత్మక రికార్డు
- మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన
- రాష్ట్ర ఈ-గవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం 5లో..



హైదరాబాద్, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పాలనకు ప్రతీకగా నిలిచిన మీసేవ సేవలు మరో అరుదైన ఘనతను సాధించాయి. గతంలో రోజుకు సగటున 80 వేల వరకు మాత్రమే నమోదయ్యే లావాదేవీలు, తాజాగా ఒక్కరోజులోనే 2.20 లక్షలకు చేరుకోవడం విశేషమని శ్రీధర్ బాబు తెలిపారు.

## కేరళలో కుండపోత

- కొండచరియలు విరిగిపడి
- ముగ్గురు మృతి.. 8 జిల్లాల్లో రెడ్ అలర్ట్
- కొట్టాయంలో యువకుడు మృతి

2లో..

తిరువనంతపురం, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్

కేరళను భారీ వర్షా లు వణికిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లకు పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. శనివారం ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో చోటుచేసుకున్న వేర్వేరు కొండచరియల ఘటనల్లో ముగ్గురు మరణించగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు.



## హుందాతన రాజకీయాలకు గుడ్‌బై

కక్షపూరిత రాజకీయాలకు రెడ్ కార్పెట్


విమర్శిస్తే కేసులు... ప్రశ్నిస్తే వేధింపులా?

అధికారం మారితే ప్రతీకార చర్యలేనా?

ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్న నేటి రాజకీయ సంస్కృతి

భిన్నాభిప్రాయాలకు చోటు లేదా?

2లో..




తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 1,
అనంత జనశక్తి న్యూస్

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు శాశ్వతం మిత్రులు ఉండరు అనేది ఒకప్పటి సిద్ధాంతం కానీ నేడు కక్షపూరిత రాజకీయాలే ప్రధాన ఎజెండాగా దేశంలో రాజకీయాల తీరు రోజురోజుకూ మారుతోంది. ఒకప్పుడు రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా పరస్పర గౌరవం కనిపించేది. శాసనసభల్లో, పార్లమెంట్‌లో తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్న నాయకులు సభ ముగిసిన తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకునేవారు.

# కాక్రోచ్‌లు దేన్నైనా మార్చగలవు: పాకిస్థాన్ మంత్రి నఖ్వీ

భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీ సృష్టించిన విధ్వంసం తెలిసిందే. అయితే పాకిస్థాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తరహాలో యువత ఉద్యమిస్తున్నట్లు వార్తలు వెలుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ హోంశాఖ మంత్రి మోషిన్ నఖ్వీ కీలక వ్యాఖ్యలు చేశారు. యువత తలుచుకుంటే దేన్నైనా మార్చగలరని అన్నారు. వాళ్లు(కాక్రోచ్‌లు) ఐక్యం అయితే ఏదైనా సాధ్యమే అన్న రీతిలో ఆయన స్పందించారు. పాకిస్థాన్ ప్రభుత్వ వ్యవస్థలో సూక్ష్మ స్థాయిలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్లామాబాద్‌లో జరిగిన పాకిస్థాన్ ఎకనామిక్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రస్తుత వ్యవస్థ కుప్పకూలిందని, పెరుగుతున్న దేశ సవాళ్లను ఈ వ్యవస్థ ఎదుర్కొనే సామర్థ్యంలో లేదన్నారు. మనం నివసిస్తున్న వ్యవస్థ కుప్పకూలిందని, దీంతో సమస్యలను తీర్చలేమని ఆయన అన్నారు. సంస్థాగత సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన వార్నింగ్ ఇచ్చారు. మరో పదేళ్ల తర్వాత కూడా ఇలాంటి సమస్యలతోనే పాకిస్థాన్ బాధపడాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొన్నది. నిరుద్యోగం, రాజకీయ వైరుధ్యాలు, భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయి. బలోచిస్తాన్, ఖైబర్ ఫుక్తున్‌క్వాలో భద్రత పెను సమస్యగా మారింది.

అయితే ఇటీవల సీజేపీ నేతృత్వంలో భారత్‌లో సాగిన ఉద్యమాన్ని పాకిస్థాన్ స్టడీ చేస్తున్నట్లు తెలిసింది. సంస్కరణల గురించి మాట్లాడిన మంత్రి నఖ్వీ.. నిర్వీర్య దశలోనే ఉన్న దేశ యువతను ఉద్దేశిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. యువతను ఏమైనా పిలవండి, యువకుడా లేకా కాక్రోచా లేక ఇంకేదైనా అనండి, ఒకవేళ ఈ కాక్రోచ్‌లు ఏకం అయితే, వాళ్లు దేన్నైనా మార్చగలరని అన్నారు. పాకిస్థాన్ సమస్యలన్నీ మిలిటరీ నాయకత్వంతో పరిష్కరించలేమని, ఎయిర్ చీఫ్ మార్షల్ అసిమ్ మునీర్ ఎన్ని చేసినా.. విస్తృత



స్థాయిలో వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుందని మంత్రి నఖ్వీ తెలిపారు.




# అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ అవార్డు

జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ కు .. ఇవాళ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేశారు. పుణెలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా అవార్డును అందజేశారు. లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్ మాట్లాడుతూ.. దేశ భద్రతకు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌కు, బోర్డర్ సెక్యూర్టీకి పాల్పడుతున్న అజిత్ దోవల్‌కు అందజేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డులో భాగంగా ఓ మెమొంటో, ప్రశంసా పత్రం, లక్ష క్యాష్ ప్రైజ్ ఇస్తారు. తమకు చెందిన రంగాల్లో దేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలిపిన వారికి ప్రతి ఏడాది ఈ అవార్డును అందజేస్తారు. దేశ ప్రయోజనాల రక్షణ కోసం సేవ చేసిన అజిత్ దోవల్‌ను ఈ ఏడాది అవార్డు కోసం ఎంపిక చేశారు. ఇంటెలిజెన్స్, నేషనల్ సెక్యూర్టీ అంశంలో అజిత్ దోవల్ సుదీర్ఘ కెరీర్ ఉన్నది. ఆపరేషన్ బ్లాక్ థండర్, డోక్లామ్ దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల్లో అజిత్ దోవల్ పాత్ర కీలకమైంది. 1968 నాటి కేరళ కేడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ ఆయన. మూడు దశాబ్ధాల పాటు భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా ఉన్నారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ లాంటి సున్నిత ప్రదేశాల్లో ఆయన పనిచేశారు. దీంతో పాటు ఇస్లామాబాద్, లండన్ పట్టణాల్లోనూ చేశారు. ప్రస్తుతం దోవల్ వయసు 81 ఏళ్లు. నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా సుదీర్ఘ కెరీర్‌లో కొనసాగుతున్నారు.

# కేరళలోని ఇడుక్కిలో భారీ వర్షాలు.. కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి

కేరళను భారీ వర్షాలు ముంచెత్తాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కొండచరియలు కూడా విరిగి పడుతున్నాయి. కేరళ, ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో శనివారం భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ముగ్గురు మరణించారు. అలాగే, ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. వాగమాన్ జిల్లాలో కూడా కొండచరియలు విరిగిపడటం వల్ల ఒకరు మరణించారు. ప్రభాకరన్ నాయర్ అనే అతడి మృతదేహం ఇంకా లభించలేదు. అడూర్‌మాలా ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడటంతో ఒకరు చిక్కుకుపోయారు.

అలాగే, కోచిధనుష్‌కోడి నేషనల్ హైవే, మాచిప్లావు వద్ద కూడా కొండచరియలు విరిగిపడిన కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇడుక్కి జిల్లాలోని ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇంట్లో ఉన్న ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. కొట్టాయం జిల్లాలో శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయారు. కేరళలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అనేక చోట్ల భారీగా ట్రాఫిక్ స్తంభించింది. 183వ జాతీయ రహదారిపై వందిపెరియార్ ప్రాంతంలో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు మార్గం మొత్తం బ్లాక్ అయింది. మరోవైపు నీటి మట్టం ఇంకా పెరిగిపోతోంది. పైగా చుట్టుపక్కల డ్యామ్‌ల నుంచి గేట్లు ఎత్తడంతో ఈ రోడ్డుపైకి ఇంకా నీరు చేరే అవకాశం ఉంది. ఎరాట్టుపేట, కంజిరాపల్లి, కూట్టిక్కల్, ఎరుమెలి వంటి అనేక పట్టణాలు కూడా నీట మునిగాయి.

పూంజార్ ప్రాంతంలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఇంట్లో ఇద్దరు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. భారీ వర్షాలు, వరదల నుంచి ప్రజల్ని రక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళలోని వయనాడ్ సహా అనేక ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. లోతట్టు



ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరిస్తున్నారు. అనేక ప్రాంతాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేశారు.

# వ్యాపారిపై హత్యాయత్నం.. భాగస్వామితో పాటు మరో ఆరుగురి అరెస్ట్



మహారాష్ట్రకు చెందిన పారిశ్రామికవేత్త, జీఎస్ఎమ్ ఫాయిల్స్‌కంపెనీ ఎండీ మోహన్‌సింగ్ పర్మార్ (46) పై కాల్పుల జరిగాయి. ఈ ఘటనలో గాయపడిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు సాగర్ గిరీష్ భానుశాలి (33), అతడికి సహకరించినవారిని అరెస్ట్ చేశారు. సాగర్ గిరీష్ భానుశాలి పర్మార్ కంపెనీలోని తోటి భాగస్వామి అని తెలిసి పోలీసులు ఖంగు తిన్నారు.

స్టాక్ మార్కెట్‌లో భారీగా నష్టపోయిన సాగర్ గిరీష్ పర్మార్ నుంచి రూ. 32 కోట్లు తీసుకున్నాడు. పర్మార్ అప్పు ఎగ్గొట్టేందుకు, కంపెనీని చేజిక్కించుకునేందుకు పర్మార్‌ను హత్య చేయాలనుకున్నాడు. దీంతో కంపెనీ ఉన్న వసాయ్ లోని నాయక్‌పాడ ప్రాంతంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు పర్మార్‌పై కాల్పులు జరిపారు. ఒక బుల్లెట్ భుజానికి తలిగింది. మరోసారి కాల్పులు జరిపే ప్రయత్నంలో పిస్టల్ జామ్ అయ్యింది. దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. సీసీటీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు సాగర్, అతడికి సహకరించిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# ‘నాకు 15 ఏళ్లే.. క్షమించండి మోదీజీ’: బాలిక వీడియో వైరల్

“నాకు 15 ఏళ్లే.. మోదీజీ క్షమించండి” అంటూ ఒక బాలిక మాట్లాడిన వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది . పేపర్‌లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు ఆ బాలికపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె తన తప్పు తెలుసుకుని క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది.

“నిరసనల్లో భాగంగా కొందరి ప్రభావానికి లోనైన నేను ప్రధానికి వ్యతిరేకంగా చెడు మాటలు మాట్లాడాను. నా వయసు 15 ఏళ్లు. నేను చేసిన పని క్షమించదగినది కాదు. ఇంతకు ముందెప్పుడూ ఇలా చేయలేదు. ఇక ముందూ చేయను. నా మాటలకు సిగ్గుపడుతున్నాను. యావత్ దేశానికి క్షమాపణలు చెప్తున్నాను. నన్ను క్షమించండి” అని బాలిక ఆ వీడియోలో మాట్లాడింది. ఆమెపై నోయిడా పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే ఆ ఫిర్యాదులో ఆమె వయసు 25 ఏళ్లు అని ప్రస్తావించగా.. వీడియోలో మాట్లాడిన బాలిక తన వయసును 15 ఏళ్లుగా వెల్లడించింది. జంతర్‌మంతర్‌లో నిరసన సందర్భంగా తనను తిట్టిన విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధాని మోదీ ఇన్‌స్టాలో కొన్ని గంటలముందు వీడియో పోస్టు చేసిన సంగతి తెలిసిందే. “యవ్వన దశలో ఇలాంటి తప్పిదాలు జరుగుతుంటాయి. పసితనం అంటే అదే. నేను వాళ్లను క్షమిస్తున్నా” అంటూ మోదీ తన పోస్టులో పేర్కొన్నారు. తన కుమార్తె మాట్లాడిన భాషపై ఆ అమ్మాయి తల్లి కూడా స్పందించారు. “పోలీసు అధికారులకు ఇప్పటికే క్షమాపణ లేఖ ఇచ్చాం. జరిగినదానికి మేం ఎంతగానో చింతిస్తున్నాం” అని మీడియాతో అన్నారు.



# కిశ్త్‌వాడ్‌లో క్లౌడ్‌బరస్ట్.. నిలిచిన రాకపోకలు



జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో శనివారం తెల్లవారుజామున మేఘ విస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలతో రోడ్లు బురదమయమయ్యాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్త్‌వాడ్, దోడా, రాంబన్ జిల్లాల్లో నదులు పొంగుతుండడంతో పలు వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ మూడు జిల్లాలలోని పాఠశాలలను మూసివేసి.. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నష్టపరిహారం అందిస్తామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు.

వారం రోజుల పాటు పూంఛ్, కిశ్త్‌వాడ్, జమ్మూ, రాంబాన్, ఉధంపుర్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొండచరియల ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. కిశ్త్‌వార్, మచైల్ ప్రాంతాల్లో కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు.



# పోటెత్తిన వరద.. 7 గంటలు చెట్టుపైనే!

మహారాష్ట్ర ను భారీ వర్షా లు ముంచెత్తుతున్నాయి. జల్‌గావ్‌లో అంజనీ నదికి వరద పోటెత్తింది . దీంతో చేపల వేటకు వెళ్లిన సురేష్ భిల్ అనే వ్యక్తి నదిలో చిక్కుకుపోయాడు. ప్రాణాలు కాపాడుకునేందుకు నది మధ్యలో ఉన్న చెట్టు పైకి ఎక్కాడు. అతడిని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వరద ఉద్ధృతి కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలగడంతో.. దాదాపు 7 గంటల తర్వాత ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అతడిని రక్షించారు. రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లను జారీ చేసింది. ముంబయి-పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ సెక్షన్‌లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యాసంస్థలకు ప్రభుత్వం నేడు సెలవు ప్రకటించింది.



# ఇక్కడ ఉమ్మివేసి.. విదేశాల్లో పరిశుభ్రంగా ఉంటారా..?

ముంబయిలోని డంపింగ్ యార్డ్‌ల వద్ద కాలుష్యం, విష వాయువులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజలు బహిరంగంగా చెత్త పారవేయడం, రోడ్లపై ఉమ్మి వేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఇష్టానుసారం వ్యవహరిస్తూ.. విదేశాల్లో మాత్రం పరిశుభ్రంగా ఉంటారా..? అని విమర్శించింది. ఇక్కడ రోడ్లపై ప్రతిరోజూ చెత్త పడేసే వాళ్లు .. విదేశాల్లో చిన్న చాక్లెట్ కవర్ బయట పడేయాలన్నా ఆలోచిస్తారని వ్యాఖ్యానించింది.

వీధులు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం లేకుండా చూసేందుకు పౌరులకు, మున్సిపల్ అధికారులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని.. అటువంటి వారికే పరిశుభ్రమైన వాతావరణాన్ని కోరుకునే హక్కు ఉంటుందని జస్టిస్ జి.ఎస్. కులకర్ణి, ఆర్తి సాతేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రోడ్లపై చెత్త, ఉమ్మి వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

ప్రధాన రహదారులు, వీధుల్లో పడేసిన చెత్త వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. అసలు మనం నాగరిక సమాజంలోనే జీవిస్తున్నామా అని ప్రశ్నించింది. హైకోర్టు భవనం సహా నగరంలోని వారసత్వ కట్టడాల సమీపంలో చెత్తను నిర్వహించే తీరుపైనా ఆందోళన వ్యక్తం చేసింది. మున్సిపల్ వాహనాల అస్తవ్యస్త నిర్వహణ వల్ల.. ఈ ప్రాంతాలను సందర్శించే విదేశీయులతో సహా అనేకమంది పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. దీనిపై వారం రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.



అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం

ఆదివారం | రంగారెడ్డి
02.08.2026





# ఇంధన పంటలకు ఇదే తరుణం!

వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో అమ్మే అన్ని మోటారు వాహనాలూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ మాత్రమే కావాలి. ఒక దశాబ్దకాలంలో మనం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాలను తొలగిస్తూ, వందశాతం ఈవీలకు మళ్లగలిగితే.. మనకు ఏడాదికి 25 కోట్ల టన్నుల భారీ స్థాయి ముడిచమురు అవసరం ఉండదు. బొగ్గు, చమురుపై ఆధారపడటం మానవాళి చరిత్రలో స్వల్పకాలిక దశ మాత్రమే. చివరికి మనకి బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు ఖాళీ అవుతాయి. సౌరశక్తిని, జీవపదార్థాన్ని (బయోమాస్) ప్రత్యామ్నాయ ఇంధనంగా మార్చటం మీదే భవిష్యత్తు ఆధారపడి ఉంది. సౌర విద్యుదుత్పత్తి, స్టోరేజీ బ్యాటరీల ద్వారా ఇప్పుడు మనం ఆ ఇంధన స్వప్నానికి మునుపెన్నడూ లేనంత చేరువలోకి వచ్చాం. జీవ పదార్థాన్ని వినియోగ ఇంధనంగా సమర్థవంతంగా మార్చుకోవటానికి కొత్త సాంకేతికతలు ఇప్పుడు మనకో అవకాశాన్నిస్తున్నాయి.

మన వ్యవసాయ సాగుభూమి 170–180 మిలియన్ హెక్టార్లు. మొత్తం ప్రపంచ సాగునేలలో ఇది సుమారు 11శాతం. ఏడాది పొడవునా పంటలకు అనుకూలంగా ఉండేలా పుష్కలమైన సూర్యరశ్మి, ఉష్ణోగ్రతలు మనకున్నాయి. మన రుతుపవనాలు కావలసినంత వర్షపాతాన్ని అందిస్తాయి. మన భూములు సారవంతమైనవి. 1950లో భారత్ సుమారు 5.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. దీనివల్ల మనం దిగుమతులపై భారీగా ఆధారపడ్డాం. అలాంటిది, ఇప్పుడు మనకు భారీ మిగులు ఉంది. 2024–25లో రికార్డు స్థాయిలో 35.8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేశాం. దిగుబడుల సమయంలో, మన ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 8 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు గోదాములలో నిల్వ చేస్తోంది. ప్రస్తుతం మన ధాన్యం గిడ్డంగులలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఆహారధాన్యాలను ఇలా మనం పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నా, వినియోగంలో సమాజం పోకడలు మాత్రం మారిపోయాయి. ప్రజల ఆహారపు అలవాట్లు మారటం, వైవిధ్యభరితం కావటంతో బియ్యం, గోధుమల తలసరి వినియోగం తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పరిమితమైంది. అయినా కూడా ఎప్పుడో కొరతల కాలంలో ప్రవేశపెట్టిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి ప్రభుత్వం బలవంతంగా ధాన్యం కొనాల్సి వస్తోంది. వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లోకి ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తోంది. పీడీఎస్‌కి సరఫరా చేసిన ఆహార ధాన్యాలలో సుమారు 40 శాతాన్ని లబ్ధిదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రీసైక్లింగ్‌తో ఇవి చాలా సందర్భాలలో తిరిగి ఎఫ్‌సీఐకి చేరుతున్నాయి. మరోవంక, ఎంఎస్‌పీ పేరుతో అర్థరహిత ప్రోత్సాహకం ఇస్తుండటంతో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు మళ్లటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు.

ఇంధన పంటల పెంపకానికి సరైన రీతిలో రూపకల్పన చేసి అమల్లోకి తెస్తే, అన్ని సమస్యలనూ ఒక్కసారిగా పరిష్కరించగలదు. రైతులకు ఆదాయం పెరగటం, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గించటం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించటం, ఇంధన భద్రత కల్పించటం, చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించటం, పర్యావరణాన్ని పరిరక్షించటం.. ఇవన్నీ ఆ ఒక్క మార్పుతో సాధ్యమవుతాయి. ఉదాహరణకు, హైబ్రిడ్ సూపర్ నేపియర్ గ్రాస్‌ను నీటి వనరులున్న వరి సాగు భూముల్లో పండించటం. ఆ గడ్డి పెంపకానికి ఆ తరహా భూములు అనువైనవి. దీనివల్ల, రైతులు ఎకరాకు ఏడాదికి సుమారు 160 మెట్రిక్ టన్నుల తాజా గడ్డిని పండించగలరు. దీన్నుంచి 8 టన్నుల కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)ను ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఎల్‌పీజీ(వంటగ్యాస్)కి ప్రత్యామ్నాయం. అంతేకాదు, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం (బయోచార్), జీవ ఇంధన ఎరువు వంటివి ఉత్పత్తి చేసి అమ్ముకోవచ్చు. ఈ రకంగా రైతులు ఎకరాకు రూ.80,000 నుంచి 1,00,000 నికర ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించనవసరం లేదు. రైతులకు గ్యారంటీగా, స్థిరంగా మంచి ధర లభించేలా భరోసాకు చర్యలు తీసుకుంటే చాలు (ఉదాహరణకు, తాజా నేపియర్ గడ్డి ఎం.టికి రూ.700–800, ఎండు రకానికి టన్నుకు రూ.3,000 వరకు). కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిలో ముడిసరుకు లభ్యతకు ఢోకా లేకుండా సీబీజీ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలి. ప్రభుత్వం ఇప్పటికే అటువంటి పరిశ్రమలకు పెట్టుబడి వ్యయ (క్యాపెక్స్) రాయితీలు, సీబీజీ కొనుగోలుకు హామీ ఇవ్వటం వంటి రూపాల్లో ప్రోత్సాహకాలను ఇస్తోంది. మనం చేయవలసిందల్లా ఈ ప్రక్రియను విస్తృత స్థాయికి విస్తరించటం. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణకు విధివిధానాలను రూపొందించటం, ముడిసరుకును పరిశ్రమలకు అంతరాయం లేకుండా సరఫరా చేయటం, రైతులకు న్యాయమైన ధర వచ్చేట్లు భరోసా ఇవ్వటం. ఈపాటి ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేస్తే, పదుల లక్షల ఎకరాల పల్లపు భూమిలో వరి లాంటి పంటలకు బదులు ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చు.

మనం భారత్‌లో 11.5 కోట్ల ఎకరాలలో వరి పండిస్తున్నాం. ఇందులో రెండు శాతం– సుమారు 25 లక్షల ఎకరాల భూమిని గనక నేపియర్ గ్రాస్ సాగుకు పూర్తిస్థాయిలో మళ్లించగలిగి, దాన్ని కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చగలిగితే సూర్యరశ్మి పుష్కలంగా ఉన్న మన భూముల్లో 2 కోట్ల టన్నుల సీబీజీని ఏటా ఉత్పత్తి చేయగలం. భారతదేశానికి వంటగ్యాస్ దిగుమతి అవసరం ఉండదు. ప్రస్తుత ధరల ప్రకారం– సుమారు రూ.1,50,000 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోగలం. భూమి ఉత్పాదకత పెరిగినకొద్దీ, మనం ఇంధన పంటల్ని ఎక్కువ ప్రాంతాలకు విస్తరించవచ్చు. ఆహార భద్రతకు ఢోకా లేకుండానే ఇవన్నీ చేయవచ్చు.

అదే విధంగా, భారత్‌లో 21 కోట్ల ఎకరాల అటవీ భూమి ఉంది. మన వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన ఇంధన చెట్లను అడవుల్లో పెంచవచ్చు. ఉదాహరణకు, పాప్లర్(కాటన్ వుడ్), విల్లో(కొండ గన్నేరు), యూకలిప్టస్ (నీలగిరి), సరుగుడు, గుమ్మడి టేకు(గహర్), మాంగియం (మక్కం), సుబాబుల్ తదితరాలు. ఒక ఎకరం అటవీ భూమిలో ఏటా ఎకరాకు 5 టన్నుల జీవ పదార్థాన్ని (బయోమాస్) సాధారణంగా ఉత్పత్తి చేయవచ్చు. జీవ పదార్థాన్ని ఇంధనంగా పూర్తిస్థాయిలో మార్చటానికి ఇప్పుడు సాంకేతికతలు(పైరోలిసిస్, ఎంజైమ్‌లు) అందుబాటులో ఉన్నాయి. అటవీ భూమిలో సుమారు 10శాతం గనక ఇంధన వృక్షాల పెంపకానికి కేటాయించగలిగితే బయోఇథనాల్, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం లేదా సుమారు 2.5 కోట్ల టన్నుల దిగుమతి నూనెకు సమానమైన విలువగల రసాయనాల్ని మనం ఉత్పత్తి చేయగలం.

మన భూ విస్తీర్ణం, సారవంత నేలలు, ఉష్ణమండల వాతావరణం, ప్రస్తుత సాంకేతికత, విస్తృత స్థాయి వల్ల సగటు వ్యయం తగ్గటం... ఇవన్నీ మనం హైడ్రోకార్బన్ల దిగుమతి మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను విముక్తం చేసే అద్భుతావకాశాన్నిస్తున్నాయి. ఒక కీలక విధాన నిర్ణయం అమలు 'ఇన్ని రకాల లాభాలను సమాజానికి అందించటం' అరుదుగా మాత్రమే జరుగుతుంది. మనం ఈ అవకాశాన్ని తక్షణం అందిపుచ్చుకోవాలి.

# నేరస్థుల చేతిలో సాంకేతిక ఆయుధం

**ఇప్పటికే అనేక ఆందోళనలకు కారణమవుతున్న కృత్రిమ మేధ(ఏఐ)పై ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఏఐ ప్లాట్‌ఫామ్స్‌పై వ్యూహరచన చేస్తుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి అనేక ఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో నేరగాళ్ల చేతిలో ఏఐ ఒక ఆయుధంగా మారకుండా ప్రభుత్వాలు, ఆయా సంస్థలు జాగ్రత్తపడాలి.నిరుడు జరిగిన ఓ ఘటనలో చాట్‌జీపీటీ ప్రమేయం ఆలస్యంగా వెలుగు చూసింది. అమెరికాలోని ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ విద్యార్థి ఫీనిక్స్ ఇక్నర్ తాను సంచలనంగా మారాలంటే ఎంతమంది సహచర విద్యార్థులను చంపాలనేది తెలుసుకోవాలనుకున్నాడు. చాట్‌జీపీటీని అడగగా 'సాధారణంగా 3 లేదా అంతకంటే ఎక్కువ మంది చనిపోతే, మొత్తం బాధితుల సంఖ్య అయిదు నుంచి ఆరుగురి వరకు ఉంటే ఆ వార్త జాతీయ మీడియాలో వస్తుంది' అని సమాధానం చెప్పింది. అంతకుముందు అతను తాను ఎంత నిరాశాపూరితంగా, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలతో ఉన్నాడో ఆ చాట్‌బాట్‌కు వివరించాడు. ఆ తర్వాత ఇక్నర్ ఒక హ్యాండ్‌గన్,**



**మందుగుండు సామగ్రి చిత్రాన్ని అప్‌లోడ్ చేసి దాన్ని ఎలా ఉపయోగించాలో చాట్‌బాట్‌ని అడిగాడు. ఆ తర్వాత ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీలో ఇద్దరిని చంపి, ఆరుగురిని గాయపరిచాడు. ఈ దారుణంలో చాట్‌జీపీటీ పాత్రపై తమ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించిందని ఫ్లోరిడా అటార్నీ జనరల్ ఉత్మీయర్ పేర్కొన్నారు.**

### పట్టించుకోని కంపెనీలు

కెనడాలోని బ్రిటిష్ కొలంబియా టంబ్లర్ రిడ్జ్ పట్టణంలో మొన్న ఫిబ్రవరిలో ఘోరమైన కాల్పుల ఘటన చోటుచేసుకుంది. 18 ఏళ్ల జెస్సీ వాన్ రూట్‌సెలార్ అనే ట్రాన్స్‌జెండర్ తన ఇంట్లో తల్లిని, సవతి సోదరుడిని కాల్చి చంపింది. ఆ తర్వాత తాను గతంలో చదివిన టంబ్లర్ రిడ్జ్ స్కూల్‌కు వెళ్లింది. అక్కడ తను జరిపిన కాల్పుల్లో ఆరుగురు మృతిచెందగా మరో 27 మంది గాయపడ్డారు. తర్వాత తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దానికి కొన్ని నెలల ముందు జెస్సీ చాట్‌జీపీటీతో తుపాకీ హింస, సామూహిక కాల్పులు, హత్య దృశ్యాలు వంటి అంశాలపై సంభాషించింది. ఆ సంభాషణలను ఓపెన్ ఏఐ ఆటోమేటెడ్ రివ్యూ వ్యవస్థ ఫ్లాగ్ చేసింది. దాన్ని సమీక్షించిన కొందరు ఉద్యోగులు ఆమె కాల్పులు, హింసకు పాల్పడే అవకాశం ఉందని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఆమె ఖాతాను మాత్రం నిలిపివేసింది. జెస్సీ మరో ఈమెయిల్‌తో కొత్త ఖాతా తెరిచి చాట్‌జీపీటీని వినియోగించింది. హింసాత్మక విషయాలపై జరిగిన సంభాషణను గుర్తించాక కూడా అధికారులను అప్రమత్తం చేయటంలో ఓపెన్‌ఏఐ కంపెనీ విఫలమైందని పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి.

అమెరికాలోని చాలామంది పాఠశాల స్థాయి విద్యార్థులు హింసకు పాల్పడటంపై ఏఐ వేదికలను సంప్రదిస్తున్నారు. ఓ విద్యార్థి తన పాఠశాల, దాని మార్గాలతోపాటు తుపాకీతో ఉన్న తన ఫొటోలను అప్‌లోడ్ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులను కాల్చి చంపినట్లు చూపించాలని కోరితే చాట్‌జీపీటీ అలాగే చేయడం ఆందోళనకు గురిచేస్తోంది. ఉగ్రవాదులు, సైబర్ నేరగాళ్లు సైతం ఏఐని విస్తృతంగా వాడుతున్నారు. నిరుడు దిల్లీ ఎర్రకోట సమీపంలో వాహనంలో అమర్చిన పేలుడు పదార్థం ద్వారా చేసిన ఉగ్రదాడిలో ప్రధాన నిందితుడు జసీర్ బిలాల్‌వాని ఏఐ, సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వనరులను ఉపయోగించి రాకెట్ ఆధారిత ఐఈడీలు, పేలుడు పరికరాల తయారీకి సంబంధించిన సమాచారం సేకరించినట్లు ఎన్‌ఐఏ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఇక డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ క్లోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం, భయపెట్టి డబ్బులు వసూలు చేయడం వంటి నేరాలైతే లెక్కలేనన్ని!

### తీసుకోవాల్సిన చర్యలివే...

నేరస్థుల సామర్థ్యాన్ని పెంచే సాధనంగా ఏఐ మారడం ఆందోళన కలిగిస్తోంది. ఏఐ వ్యవస్థలు హానికర ప్రశ్నలను నిరోధించడానికి ప్రయత్నించినా వందశాతం చేస్తాయని చెప్పలేం. భద్రతాపరమైన అంశాల్లో ఏఐ సంస్థలు తగిన బాధ్యత తీసుకోవట్లేదనే విమర్శలున్నాయి. గోప్యత పాటించాల్సిన విషయాలు, సమాజానికి ప్రమాదకరమైన ఆలోచనలు, పోలీసులూ భద్రతా సంస్థలకు తెలియజేయాల్సిన అంశాలను ప్రభుత్వాలు స్పష్టంగా నిర్వచించాలి. ఏఐ విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అందరూ సిద్ధం కావాలి. ప్రమాదస్థాయిని అంచనా వేసే వ్యవస్థలు ఏఐ కంపెనీలు, ప్రభుత్వం, భద్రతా సంస్థల్లో ఉండాలి. ఏఐతో సృష్టించే పత్రాలు, ఫొటోలు, వీడియోలపై విధిగా వాటర్ మార్క్ ఉండేలా చూడాలి. ఏఐ సంబంధిత నిఘా, నియంత్రణ, నేరాల విచారణకు ప్రత్యేక వ్యవస్థ, డీప్‌ఫేక్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. అధునాతన సాంకేతికత దుర్వినియోగం కాకుండా చట్టాలను కఠినతరం చేయాలి. పౌర సమాజాన్ని చైతన్యం చేయాలి.

# నిరసన.. నైతిక బాధ్యత

**సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణదీక్షలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాలపై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరిస్తోంది. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. సోమవారం శీతాకాల సమావేశాలు మొదలవుతున్న పార్లమెంట్ వరకూ కాక్రోచ్ జనతాపార్టీ**



**చేపట్టబోయే శాంతియుత ర్యాలీలో పాల్గొనేందుకు తాను కచ్చితంగా ఆ రోజువరకూ జీవించే ఉంటానని వాంగ్‌చుక్ విశ్వాసాన్ని ప్రకటించారు.**

తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని, సోమవారం నాటి ర్యాలీలో పాలుపంచుకొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయన పక్షాన నిలవడానికి మహామహులెవ్వరికీ ధైర్యం లేకపోయిందని సోషల్ మీడియాలో విమర్శలు ఉన్నప్పటికీ, దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన ఘట్టాన్ని ఆ పార్టీనేతలు గుర్తుచేస్తున్నారు. 2011లో అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ మన్మోహన్ సింగ్ మానవీయంగా వ్యవహరించారని, అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం, కలసికట్టుగా వ్యవహరించడం ఆ మహానుభావులకు తెలుసునని కాంగ్రెస్ వ్యాఖ్యానిస్తోంది. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని మరోపక్క జోరుగా సాగుతోంది.

లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఇప్పటి ఆయన డిమాండ్లలో ప్రభుత్వానికి గిట్టనివీ, నెరవేర్చలేనివీ కొన్ని ఉండవచ్చు. కానీ, మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటానికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియుతంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరు పక్షాలపైనా ఉంది.

# ప్రజాసేవకు అర్థమే వేరులే!

**'అడగనివాడు అవివేకి... ఏముంది, కాస్త సిగ్గు వదిలేసి లంచమడిగితే ఇల్లంతా బంగారమే. నీతి నిజాయతీలంటూ కూర్చుంటే విల్లాలూ ఎక్కడపడితే అక్కడ స్థలాలూ ఎలా సంపాదించుకోగలం? కాబట్టి జనం ఎంత ఛీత్కరించుకుంటున్నా మాకు డబ్బే సర్వస్వం' అనుకుంటూ అధికార యంత్రాంగంలో చాలామంది ఒక నిర్ణయానికి వచ్చేసినట్లున్నారు. అందువల్లే ధ్రువీకరణ పత్రాలు మొదలు ఇంటి అనుమతులు, భూ పట్టాలు, బదిలీలు, పదోన్నతులు, టెండర్లు, బిల్లుల మంజూరు... ఇలా అన్నిచోట్లా అవినీతి విశ్వరూపం దాలుస్తోంది. అందరికీ న్యాయం జరగాలన్న రాజ్యాంగ లక్ష్యాన్ని అది నీరుగార్చేస్తోంది. కడుపు నిండితే గారెలు చేదు అంటారు. కానీ, అవినీతి గ్రంథసాంగులకు మాత్రం ఎంత మేసినా ఆకలి తీరదు. సంతృప్తి ఉండదు. అందుకే, జాలీ దయా మంచీ మానవత్వం లాంటివేవీ లేకుండా కటిక పేదలను సైతం కాసుల కోసం కాల్చుకుతింటుంటారు. జాతి మూలుగను ఆబగా జుర్రేస్తుంటారు. ఇలాంటి మహానుభావుల్ని 'అవినీతి జలగలు, అనకొండలు, తిమింగిలాలు' అంటూ ఏదో శరీర ధర్మం కొద్దీ కడుపు నింపుకొనే ఆ జీవులతో పోల్చడం కచ్చితంగా వాటిని అవమానించడమే అవుతుంది!**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజినీర్ ఒకరి ఇంటితో పాటు పలు చోట్ల ఏసీబీ అధికారులు తాజాగా తనిఖీచేస్తే బహిరంగ మార్కెట్లో రూ.100 కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. ఆయన పేరిట ఉన్న లాకర్‌ను తెరిస్తే కిలోకు పైగా బంగారు ఆభరణాలు దొరికాయి. నాలుగు రెసిడెన్షియల్ ఫ్లాట్లు, అయిదు ప్లాట్లు, నాలుగెకరాల సాగుభూమి.. ఇలా ఆస్తుల చిట్టా పెద్దదే! సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓ ఇంజినీరు.. ఇతర అధికారులతో కుమ్మక్కయ్యి తన తండ్రిపేరుతో దొంగ ఏజెన్సీ సృష్టించి అభివృద్ధి పనుల పేరిట రెండేళ్లలో దాదాపు మూడు కోట్ల రూపాయలు బొక్కేశాడు. ఒక వ్యక్తి నుంచి నాలుగు లక్షల రూపాయల లంచం తీసుకుంటూ హైదరాబాద్‌లోని అబిడ్స్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. కాకినాడ కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్ ఇంట్లో సోదాలు చేస్తే రూ.ఎనిమిది కోట్ల విలువైన ఆస్తులు వెలుగు చూశాయి. ఏపీలోనే మొన్న ఫిబ్రవరిలో పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్ఈ ఇల్లు, ఇతర ప్రదేశాల్లో తనిఖీలు జరిపితే కేజీల కొద్దీ బంగారం, వెండి, నోట్లకట్టలు బయటపడ్డాయి. లంచాలూ కమీషన్ల వసూలులో బరితెగించిన ఇద్దరు ఐఏఎస్ అధికారులను బిహార్ ప్రభుత్వం కిందటి నెలలో సస్పెండ్ చేసింది. జనాన్ని, ప్రజాధనాన్ని అడ్డగోలుగా లూటీ చేస్తున్న ఇలాంటి ప్రబుద్ధ అధికారగణాల నుంచి సమాజాన్ని రక్షించేదెవరు?

అవినీతి మేతలో ఎంత ముదిరిపోయినా, స్వాహారాయుళ్ల కష్టాలూ వారికి ఉంటాయి అంటారా! నిజమే... ప్రజలను పీడించి పోగేసిన ఆస్తుల రక్షణకు నమ్మకమైన బినామీలను వెతకాలి. అక్రమ సంపాదన ఫలాలను దర్జాగా అనుభవించడంకోసం ఆ బినామీలు ప్లేటు ఫిరాయించకుండా చూసుకోవాలి. ఇదంతా ఎంత శ్రమ! తెలంగాణలో ఇటీవల ఏసీబీకి పట్టుబడిన పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డీఎస్పీది ఇలాంటి వాటిలో అందె వేసినచేయి. బహిరంగ మార్కెట్లో ఏకంగా రూ.200 కోట్ల విలువైన అక్రమాస్తులు వెనకేసి ఇప్పటిదాకా ఏసీబీకి చిక్కిన పోలీసుల్లో అత్యంత అవినీతిపరుడిగా ఆయన ఖ్యాతికెక్కాడు. ఇటీవలే తెలంగాణలోనే పట్టుబడిన ఓ సర్వే, భూ రికార్డుల ఉపసంచాలకుడిది మరోచరిత్ర! ఆయన ఇంట్లో మూలనున్న కబోర్డ్‌లో చూస్తే అయిదు సంచుల్లో కోటిన్నర రూపాయలకు పైగా నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. తనిఖీల్లో ఒకే సమయంలో ఇంత మొత్తం దొరకడం ఇదే ప్రథమం. ఆ తరవాత ఆయనగారి సతీమణి పేరిట ఉన్న లాకర్లను పరిశీలిస్తే మరో కోటిన్నర రూపాయల నగదు, రెండు కేజీల బంగారం బయటపడింది. ఏదో అవసరానికి పనికొస్తాయని పాత దుస్తుల్ని మూటకట్టి అటకమీద పెట్టినట్టుగా, ఎక్కడపడితే అక్కడ డబ్బు దాచాడంటే ఆ అధికారి ఎంత విచ్చలవిడిగా చెలరేగిపోయి ఉంటాడు! ఇంతగా కట్టుతప్పుతున్న వ్యక్తులను వ్యవస్థలెందుకు ఏళ్లపాటు చూస్తూ ఊరుకుంటున్నాయి?

చాలామంది అధికారులకు ప్రజాసేవ అంటే వారు ప్రజలకు చేసేది కాదు. ప్రజలే వారిని సేవించుకోవాలి. ఉద్యోగం సంపాదించినందుకు జీతాలు తీసుకుంటున్నాం, పని చేయాలంటే చెయ్యి తడవాల్సిందే అని సర్వీసులో చేరిన మొదటి రోజు నుంచే భీష్మిస్తున్నవారు నానాటికీ పెరుగుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాదిలో మొదటి ఆరు నెలల్లోనే అలాంటి వారిపై తెలంగాణ ఏసీబీ 126 కేసులు నమోదు చేసింది. ఏపీ ఏసీబీ నిరుడు 115 అవినీతి కేసులు కట్టింది. ఇలా వార్తల్లోకి వస్తున్నవారిలో ఎందరికి శిక్షలు పడుతున్నాయని తలచుకుంటే ఆవేదనే మిగులుతుంది. తెలంగాణలో రెవెన్యూశాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మొత్తం 323 ఏసీబీ కేసుల్లో 2021 చివరి నాటికి ఒకటిన్నర శాతమే తెమిలాయి. ఏపీలో ఇలాంటివి కొలిక్కి రావడానికి పది నుంచి పన్నెండేళ్లు పడుతోందని ఉన్నతాధికార గణమే చెబుతోంది. తమపై నమోదైన కేసుల్లో న్యాయ విచారణకు అనుమతి రాకుండా కొందరు అధికారులు పైస్థాయిలో చక్రం తిప్పుతున్నారు. బెయిల్‌పై బైటికొచ్చాక దర్జాగా ఉద్యోగం చేస్తూ పదోన్నతులూ పొందుతున్నారు. నేతలూ అధికారగణాల మధ్య పె



నవేసుకుపోయిన అనైతిక బంధం మూలంగానే పరిస్థితి ఇలా అఘోరిస్తోంది. అసలు, రాజకీయ అవినీతే అన్నిరకాల భ్రష్టాచారాలకు తల్లివేరు అవుతోంది. దానివల్లే నాసిరకం రోడ్లు, ప్రాజెక్టులు, వంతెనలు పుట్టుకొచ్చి దేశ ప్రగతి దీపం కొండెక్కిపోతోంది. అవినీతి విజృంభణ వల్ల దేశ జీడీపీకి ఏటా రెండు శాతం దాకా నష్టం వాటిల్లుతోంది. పాలన వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి చట్టాలపై గౌరవం పోతోంది. ఈ దుస్థితి తప్పిపోయి పౌరసేవల్లో నాణ్యత పెరగాలంటే సుప్రీంకోర్టు సూచించినట్లు ప్రభుత్వ ఉద్యోగి అవినీతిని రాజ్యానికి, సమాజానికి వ్యతిరేకంగా చేసిన నేరంగా పరిగణించాలి. అలాంటి నేరగాళ్లకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా చూడాలి. కానీ, నల్లధనమే ఇంధనంగా ధూర్త రాజకీయ రథాలను దౌడుతీయిస్తూ, అధికారులతో కలిసి నీకిది.. నాకిది అంటూ జాతివనరులను పంచుకుతినే నాయకులు ఉన్న పవిత్ర భారతంలో అవినీతి రాకాసిని నిజంగా భూస్థాపితం చేసేదెవరు?

# నిబద్ధతకు నిలువుటెత్తు రూపం ఇన్యాసమ్మ

- నాలుగు దశాబ్దాలకు పైగా ఇన్యాసమ్మ సేవలు చిరస్మరణీయం
- పెద్దవూర మండల విద్యాశాఖ అధికారి తరి రాము
- పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్ ఇన్యాసమ్మ పదవీ విరమణ
- భావోద్వేగ వాతావరణంలో ఇన్యాసమ్మ పదవీ విరమణోత్సవం




**నాగార్జునసాగర్ ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్**

నాగార్జునసాగర్ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సుదీర్ఘకాలం పాటు సేవలందించిన రికార్డ్ అసిస్టెంట్ ఇన్యాసమ్మ పదవీ విరమణోత్సవం శనివారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం భావోద్వేగ వాతావరణం మధ్య అభినందనల వేదికగా మారింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దవూర మండల విద్యాశాఖ అధికారి తరి రాము,తిరుమలగిరి సాగర్ విద్యాశాఖ అధికారి శ్రీను ప్రత్యేకంగా పాల్గొని సాలువాతో ఘనంగా సన్మానించి,పదవి విరమణ శుభాకాం క్షలు తెలిపారు,అనంతరం మాట్లాడు తూ ప్రభుత్వ,ప్రైవేట్ రంగాలలో ఏదైనా ఉద్యోగంలో సుదీర్ఘకాలం పాటు ఒకే నిబద్ధతతో పనిచేయడం అంత సులభం కాదు.కానీ,ఇన్యాసమ్మ సుమారు 42 సంవత్సరాల సుదీర్ఘ సేవా కాలంలో ఏనాడు విధుల్లో అలసట ప్రదర్శించ కుండా,ఎంతో బాధ్యతా యుతంగావ్యవహరించారు పాఠశాల అభివృద్ధిలో,విద్యార్థుల ప్రగతిలో సిబ్బంది పాత్రఎంత ముఖ్య మో ఇన్యాసమ్మ పనితీరు నిరూపించిం ది,ఉద్యోగ విరమణ తర్వాత సంపూర్ణ ఆరోగ్యంతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు,ఈ వేడుకకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధా నోపా ధ్యాయులు,సిస్టర్ లలిత మాట్లాడుతూ మా పాఠశాలలో గత నాలుగు దశాబ్దాలకు పైగా ఒక కుటుంబ సభ్యురాలిగా ఇన్యాసమ్మ సేవలు అందించడం మాఅందరికీ గర్వకారణం పాఠశాలకు సంబంధిం చిన ప్రతీ రికార్డును,పనులను ఎంతో నిజాయితీతో,బాధ్యతగా పూర్తి చేసేవారు,వారి సేవలను పాఠశాల యాజమాన్యం ఎప్పటికీ మరువలేదు

వారు చూపిన అంకితభావం రాబోయే తరాలకు,తోటి సిబ్బందికి ఎంతో ఆదర్శప్రాయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో అలరించాయి,ఈ వీడ్కోలు కార్యక్రమం లో కుర్మా రెడ్డి,పైలాన్ కాలనీ ప్రభుత్వ మోడల్ హై స్కూల్ ప్రధానోపాధ్యా యులు శేషు,పాఠశాల ఉపాధ్యాయ బృందం,స్థానిక ప్రముఖులు,విద్యార్థులు పాల్గొని ఇన్యాస మ్మకు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

# పాయం కామరాజుకు ఎమ్మెల్యే నివాళి




- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి

**మణుగూరు, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్**

మణుగూరు మండలం తిర్లాపురం గ్రామ మాజీ సర్పంచ్ పాయం కామరాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం విజయనగరం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దివంగత పాయం కామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం చెప్పడంతో పాటు, భగవంతుడు పాయం కామరాజు ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. అనంతరం దివంగత పాయం కామరాజు సతీమణి, తిర్లాపురం గ్రామ సర్పంచ్ పాయం చిట్టెమ్మను ప్రత్యేకంగా పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని ప్లే స్కూల్స్







- తల్లిదండ్రుల నుంచి భారీ ఫీజుల వసూలు
- స్థానిక అధికారుల తనిఖీలు శూన్యం.?
- ఏజెన్సీ ప్రాంతంలో నిబంధనలు అమలవుతున్నాయా..?
- పిల్లల భద్రత, ప్రమాణాలపై ఆందోళన

**మణుగూరు, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్**

మణుగూరు పట్టణంలోని సుందరయ్య నగర్, అశోక్ నగర్ లో నిర్వహిస్తున్న కొన్ని ప్లే స్కూళ్ల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అవసరమైన అనుమతులు, ప్రమాణాలు లేకుండానే కొన్ని ప్లే స్కూల్స్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్లే స్కూళ్లు నిర్వహించాలంటే సంబంధిత శాఖలు నిర్దేశించిన భవన భద్రత, పరిశుభ్రత, తాగునీరు, టాయిలెట్స్, పిల్లల భద్రత, అగ్నిమాపక భద్రత (అవసరమైతే), స్థానిక సంస్థల అనుమతులు, వ్యాపార లైసెన్స్ వంటి నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అలాగే చిన్నారుల సంరక్షణకు తగిన శిక్షణ పొందిన సిబ్బంది, సీసీ కెమెరాలు, ప్రాథమిక వైద్య సదుపాయాలు వంటి అంశాలు కూడా ఉండాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే విద్యాసంస్థలు ప్రభుత్వ మార్గదర్శకాలు, సంబంధిత శాఖల అనుమతులు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయినప్పటికీ కొన్ని ప్లే స్కూళ్లు తల్లిదండ్రులకు పూర్తి వివరాలు వెల్లడించకుండా అడ్మిషన్లు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, యూనిఫాం, పుస్తకాలు, రవాణా తదితర పేర్లతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. అయితే ప్లే స్కూళ్లకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ప్రభుత్వ ఫీజు నిర్మాణం లేదు. వసూలు చేసే ఫీజుల వివరాలను తల్లిదండ్రులకు పారదర్శకంగా తెలియజేయడం, రసీదులు ఇవ్వడం, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం నిర్వహణ బాధ్యతగా ఉంటుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అనుమతులు ఉన్నాయా? భవన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? పిల్లల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయా? వసూలు చేస్తున్న ఫీజులకు సరైన లెక్కలు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, ఐటీడీఏ, స్థానిక సంస్థలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో అన్ని ప్లే స్కూళ్ల అనుమతుల వివరాలు, ఫీజుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచితే పారదర్శకత పెరుగుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. చిన్నారుల భవిష్యత్తు, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ప్రజలు కోరుతున్నారు.

# రేగాను సస్పెండ్ చేయాలి



- పిర్నాకి నవీన్
- బాధితురాలికి న్యాయం చేయాలి
- మహిళా నేతలు స్పందించాలి

కేటీఆర్ చర్యలు తీసుకోవాలి

**మణుగూరు, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్ :**

పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆయనను వెంటనే బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీరినాకి నవీన్, కూరం రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధిగా పనిచేసిన వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం అత్యంత బాధాకరమన్నారు. యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తామని నమ్మించి ఓ యువతిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలు వెలువడడం మహిళల పట్ల అవమానకరమని విమర్శించారు. మహిళల ఓట్లతో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి ఇటువంటి ఆరోపణలు ఎదుర్కోవడం పినపాక నియోజకవర్గానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే స్పందించి రేగా కాంతారావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు ఈ ఘటనపై స్పందించి బాధితురాలికి అండగా నిలవాలని కోరారు. ఆరోపణలను సమర్థించే ప్రయత్నాలు చేయకుండా మహిళల గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సూరపరెడ్డి తరుణ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, సీనియర్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడి బాబు, తుపూడి శ్రీను, దొడ్డపనేని మధు, చింతల కృష్ణ, దేశబోయిన లవకుమార్, బత్తుల శ్రీను, గుడికందుల ప్రసాద్, కరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమలా నెహ్రూ ఆసుపత్రిలో పాలకవర్గం సమీక్ష

- ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- వైస్ చైర్మన్ గొడవర్తి రాజా ప్రసాద్



**నాగార్జునసాగర్,ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్**

నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని కమలా నెహ్రూ ఆసుపత్రిని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి,ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ పాలకవర్గం ఆసుపత్రి సూపరింటెండెంట్,డాక్టర్ హరికృష్ణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించింది,అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు,ఈ సందర్భంగా నందికొండ వైస్ చైర్మన్ గొడవర్తి రాజప్రసాద్ మాట్లాడుతూ,ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు,డ్యూటీ డాక్టర్లందరూ విధుల్లో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యం,మందుల నిల్వలపై సూపరింటెండెంట్, హరికృష్ణ,అవసరమైన అన్ని రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని వదంతులు నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారుఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని నాయకులు సూచించారు.గత వారం ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని ఆరోపణలు చేసి,కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని వైస్ చైర్మన్ రాజప్రసాద్ మండిపడ్డారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని,వచ్చే ఎన్నికలలో తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకుడు అంటే ప్రజలకు ధైర్యం ఇవ్వాలి కానీ,భయబ్రాంతులకు గురిచేయకూడదని ప్రతిపక్షాలకు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ ముఖ్య సలహాదారుడు సుమన్,ఆరో వార్డు కౌన్సిలర్ చందు లాల్ నాయక్,ఒకటో వార్డు కౌన్సిలర్ సలహాదారుడు రాజగోపాల్ రెడ్డి, నాలుగో వార్డు కౌన్సిలర్ సలహాదారుడు మంద గౌతమీ రఘువీర్ బిన్నీ, ఏడో వార్డు కౌన్సిలర్ సలహాదారుడు వెంకటేశ్వర్లు,పదవ వార్డు కౌన్సిలర్ సలహాదారుడు రాజేష్,ఆసుపత్రి సీఎంవో డాక్టర్ హరికృష్ణ,డ్యూటీ డాక్టర్లు మరియు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరోజులో రికార్డు స్థాయిలో 2.20 లక్షల లావాదేవీలు

(మొదటిపేజీ తరువాయి)

మీసేవ చరిత్రలో తొలిసారిగా రెండు లక్షల మార్క్‌ను అధిగమించడం రాష్ట్ర ఈగవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ కార్డు దరఖాస్తులకు అత్యధిక స్పందన లభించగా, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం కూడా భారీ సంఖ్యలో ప్రజలు మీసేవను ఆశ్రయించినట్లు వెల్లడించారు. ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడం వల్లే ఈ స్థాయి ఆదరణ లభించిందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా లక్షలాది లావాదేవీలను విజయవంతంగా నిర్వహించిన మీసేవ బృందాలు, సాంకేతిక నిపుణులు, సంబంధిత శాఖల అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా భవిష్యత్తులో మరిన్ని పౌర సేవలను మీసేవ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించి సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి పౌరుడు ప్రభుత్వ సేవలను కార్యాలయాల చుట్టూ తిరగకుండా డిజిటల్ విధానంలో సులభంగా పొందేలా మీసేవను మరింత విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.



# ర్యాగింగ్ సరదా కాదు.. జైలు శిక్షకు దారి తీసే నేరం: మెజిస్ట్రేట్ సూరిరెడ్డి



**మణుగూరు, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్**

ఫన్ పేరుతో చేసే ర్యాగింగ్ కేవలం సరదా కాదని, అది చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎంఎల్ఎస్ఏ) చైర్మన్ కంబపు సూరిరెడ్డి అన్నారు. శనివారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ర్యాగింగ్ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర చర్య అని, క్షణికావేశంలో చేసే తప్పిదం జీవితాంతం ఇబ్బందులకు గురిచేస్తుందని హెచ్చరించారు. కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను భయపెట్టడం, అవమానించడం వంటి చర్యలకు పాల్పడకుండా వారికి సోదరభావంతో అండగా నిలిచి మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. గౌరవం బెదిరింపులతో కాకుండా మంచి వ్యక్తిత్వం, సత్ప్రవర్తనతో సంపాదించుకోవాలని చెప్పారు. విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను కూడా బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వాటి వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే కళాశాల యాజమాన్యానికి లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు. అలాగే బాల్యవివాహాలు కూడా చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ర్యాగింగ్, డ్రగ్స్, బాల్యవివాహాలకు పాల్పడినా లేదా వాటికి సహకరించినా క్రిమినల్ కేసులు నమోదై భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ పాటి నాగబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రకాశ్, న్యాయవాదులు, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మారెల్లపాడు పంప్ హౌస్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

- నాణ్యతతో గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- రైతులకు సాగునీటి అందుబాటు మెరుగుపడుతుందని వెల్లడి

**మణుగూరు, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మారెల్లపాడు పంప్ హౌస్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంపుల ఏర్పాటు, ప్రధాన పంప్ హౌస్‌లో మోటార్ల కప్లింగ్, ప్రెషర్ మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు పనుల పురోగతిని సమీక్షించారు. అన్ని పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్ ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం ప్రెషర్ మెయిన్-తుమ్మల చెరువు ఫీడర్ కాలువ అనుసంధాన ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టు రైతులకు సాగునీటి అందుబాటు మెరుగుపడి వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఇంజనీర్లు, మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మోడిఫైడ్ సైలెన్సర్లతో తిరిగిన 12 ద్విచక్ర వాహనాలపై కేసులు



**- ప్రత్యేక తనిఖీలు చేపట్టిన కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు**
**- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకున్న ద్విచక్ర వాహనాలపై శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 12 ద్విచక్ర వాహనాలు మోడిఫైడ్ సైలెన్సర్లతో నడుస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయా వాహనదారులపై మోటారు వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 190(2) ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి వసూలు చేశారు. అనంతరం వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ఇటువంటి మార్పులు చట్టవిరుద్ధమని తెలిపారు. వాహనదారులు కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

## ఆపరేషన్ ముస్కాన్-XIIలో 95 మంది బాలకార్మికులకు విముక్తి




**- 48 మందిపై కేసులు.. 38 మందికి నోటీసులు జారీ**
**- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలి: ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్ :

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-XII కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 95 మంది బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఆపరేషన్ ముస్కాన్-XII విజయవంతం కోసం జిల్లాలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని శాఖల సమన్వయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. గుర్తించిన 95 మంది బాలకార్మికుల్లో 89 మంది బాలురు, ఆరుగురు బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్నారులను పనిలో పెట్టుకున్న 48 మంది యజమానులపై కేసులు నమోదు చేయగా, మరో 38 మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజం మొత్తం బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఆపరేషన్ ముస్కాన్-XIIను విజయవంతంగా నిర్వహించి బాలలను వారి తల్లిదండ్రులకు చేరవేసిన ప్రత్యేక బృందాల సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులా..?

**- రేగా కాంతారావుపై కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి**
**- ప్రజా తీర్పుకు భయపడి కుట్రలు చేస్తున్నారంటూ కాంగ్రెస్‌పై కొండేరు రాము ధ్వజం**

మణుగూరు, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్




పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ నాయకులు తప్పుడు కేసులు బనాయించి సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ఉప్పాక మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు కొండేరు రాము తీవ్రస్థాయిలో విమర్శించారు. నిబద్ధతతో ప్రజలకు సేవ చేసిన నాయకుడిపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం అధికార పార్టీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. సంబంధిత కేసుపై ఇప్పటికే హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసినా, వాస్తవాలను దాచిపెట్టి అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఓ గిరిజన నాయకుడిపై అసభ్య పదజాలంతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రేగా కాంతారావు ప్రజాదరణ పెరుగుతుందనే భయంతోనే ముందస్తు కుట్రలకు తెరలేపుతున్నారని కాంగ్రెస్ నాయకులపై చురకలంటించారు. చివరికి నిజం తప్పకుండా వెలుగులోకి వస్తుందని, ప్రజలే అసలు నిజానిజాలను తేల్చి తగిన గుణపాఠం చెబుతారని కొండేరు రాము స్పష్టం చేశారు.

# ఉగ్రరూపం దాలుస్తున్న గోదావరి..





**- భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు**
**- క్షేత్రస్థాయిలో వరద పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్**
**- లోతట్టు ప్రాంతాల ప్రజలు తప్పనిసరిగా పునరావాస కేంద్రాలకు తరలింపు**
**- వరద ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత..**
**- , పోలీసు నిఘా పెంపు**
**- ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం..**
**- అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:

భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. శనివారం ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 56 అడుగులకు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం 15,90,778 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం గోదావరి స్నాన ఘాట్లు, కరకట్ట ప్రాంతం, భద్రాచలం, కూనవరం ప్రధాన రహదారి వెంట వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత గ్రామాల్లో టామ్‌టామ్, మైకింగ్ ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆలస్యం చేయకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, నాణ్యమైన భోజనం, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వరద నీరు చేరిన ప్రాంతాల్లో వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రజలు గోదావరిలో స్నానాలు చేయడం, ఈత కొట్టడం, వరద నీటిలోకి వెళ్లడం, ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, వంతెనలు, కరకట్టలపైకి వెళ్లడం, చేపలు పట్టడం లేదా పడవల ద్వారా ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని, అత్యవసర పరిస్థితుల్లో జిల్లా 24×7 ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 08744241950 లేదా వాట్సాప్ నంబర్ 9392919743ను సంప్రదించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయక చర్యలను విస్తృత స్థాయిలో కొనసాగిస్తున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. అధికారులు సూచించిన భద్రతా చర్యలను ప్రజలు తప్పనిసరిగా పాటిస్తే అవాంఛనీయ ఘటనలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం

**- జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లేనినా**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో
ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్



బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ తర్వాత మరో సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వడం తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు రక్షణ కవచం లాంటిదని జిల్లా సంక్షేమ అధికారిని జే స్వర్ణలత లేనినా పేర్కొన్నారు. స్థానిక భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్ లోని తల్లి పాలిచ్చే గదిని లాంఛనంగా ప్రారంభించి బాలింతలకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని మాట్లాడుతూ ప్రసవించిన మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించేలా తల్లులకు సహకారం అందించాలని, తల్లిపాలే నవజాత శిశువును అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయని, బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించడం, ఈ ఆరు నెలల్లో బిడ్డ ఎదుగుదల మరి అభివృద్ధికి అవసరమైన పోషకాలన్ని తల్లిపాలలోని లభిస్తాయని, ఇలాంటి ఇతర పదార్థాలు తినిపించకుండా, త్రాగించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే తల్లి బిడ్డల ఆరోగ్య భద్రత ఉంటుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా బిడ్డ పుట్టిన వెంటనే తేనే, పంచదార లాంటి మూఢనమ్మకాలు నమ్మకుండా ముర్రుపాలె ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అర్బన్ సిడిపిఓ, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారిత జిల్లా బృందం, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# మోసం కేసును ఛేదించిన పోలీసులు

**- ప్రధాన నిందితుడి అరెస్టు..**
**- నేరార్జిత ఆస్తులుగా గుర్తించిన 35 వాహనాలు స్వాధీనం**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,
ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలు, ఇతర చరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వివరాలను వెల్లడించడం జరిగింది. భార్పాటీ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు తాను భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని, తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుంచి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడుల పేరుతో మోసపూరితంగా డబ్బులు సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీలు ఇచ్చి మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని తెలిపారు. అలాగే బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ ఈ మోసపూరిత కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకువచ్చి పోలీసు కస్టడీలో విచారించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాధితుల నుంచి మోసపూరితంగా సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఒక మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సంబంధిత పత్రాల పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. మరిన్ని బాధితులను గుర్తించడం, నేరార్జిత ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకోవడం, పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అధిక లాభాలు వస్తాయని, తక్కువ సమయంలో పెట్టుబడికి రెట్టింపు లేదా భారీ రాబడులు వస్తాయని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఆకర్షణీయమైన హామీలు, నకిలీ పత్రాలు, తప్పుడు ఒప్పందాలతో మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా లేదా మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఇటువంటి ఆర్థిక నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.

ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బందిని, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

# రోబోట్ తో గుండె మైట్రల్ వాల్వ్ మార్పిడి

**- 5 గంటలకు పైగా సర్జరీ**
**- హైరాబాద్ లోనే అరుదైన సర్జరీ**

హైదరాబాద్, ఆగస్టు 1,అనంత జనశక్తి న్యూస్




కిమ్స్ హాస్పిటల్, గచ్చిబౌలి వైద్యులు రోబోటిక్ సహాయంతో మైట్రల్ వాల్వ్ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రాజమండ్రికి చెందిన 37 ఏళ్ల యువకుడికి చేసిన ఈ శస్త్రచికిత్స గచ్చిబౌలి కిమ్స్‌లో తొలిసారి నిర్వహించబడటమే కాకుండా, హైదరాబాద్‌లో అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ గుండె శస్త్రచికిత్సల్లో మరో మైలురాయిగా నిలిచింది.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను రోబోట్ సర్జరీ చేసిన చీఫ్ కార్డియోథొరాసిక్, రోబోటిక్ మరియు మినిమల్ ఇన్వేసివ్ సర్జన్ డా. నిసర్గ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి ప్రాంతానికి చెందిన రొయ్యల ఎగుమతి సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న 37 ఏళ్ల యువకుడు చాలా కాలంగా దీర్ఘకాలిక రుమాటిక్ గుండె వ్యాధి కారణంగా తీవ్రమైన మైట్రల్ స్టెనోసిస్‌తో బాధపడుతున్నాడు. అంటే గుండె ఎడమ భాగంలో వాల్వ్ ఎడమ ఎట్రియం నుంచి ఎడమ వెంట్రికల్‌కు రక్తం సులభంగా వెళ్లేలా తెరుచుకుంటుంది. కానీ వాల్వ్ మందపడి లేదా అతుక్కుపోయి ఇరుకుగా మారితే రక్త ప్రవాహం తగ్గిపోతుంది. దీనినే మైట్రల్ స్టెనోసిస్ అంటారు. దీని వల్ల తీవ్రమైన సమస్య ఏర్పడుతుంది. ఒక్కొక్కసారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. మూడేళ్ల క్రితం మొస్తరు మైట్రల్ స్టెనోసిస్‌గా నిర్ధారణ కావడంతో కిమ్స్ గచ్చిబౌలి కార్డియాలజీ విభాగం పర్యవేక్షణలో మందులతో చికిత్స పొందుతున్నాడు. అయితే వ్యాధి తీవ్రత పెరగడంతో గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు అధికమయ్యాయి. దీంతో శస్త్రచికిత్స అవసరమైంది.జూలై 23న నిర్వహించిన ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స సుమారు ఐదు గంటలకు పైగా సాగింది. రోబోటిక్ ఇంట్రాకార్డియాక్ శస్త్రచికిత్సలు హైదరాబాద్‌లో ఇప్పటికీ చాలా అరుదుగా జరుగుతున్నాయన్నారు.సాధారణ ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలో ఛాతీ ఎముకను కోయాల్సి వస్తుంది. కానీ రోబోటిక్ విధానంలో చిన్న రంధ్రాల ద్వారానే శస్త్రచికిత్స చేయడం వల్ల రక్తస్రావం తక్కువగా ఉండటం, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గడం, నొప్పి తక్కువగా ఉండటం, త్వరగా కోలుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. శస్త్రచికిత్స జరిగిన కొన్ని గంటల్లోనే వెంటిలేటర్ తొలగించగా, మరుసటి రోజే రోగి నడవగలిగాడని తెలిపారు."యువ రోగులకు ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్స పెద్ద మానసిక, శారీరక భారం. రోబోటిక్ సాంకేతికతతో అత్యంత ఖచ్చితత్వంతో వాల్వ్ మార్పిడి చేసి శరీరంపై ఒత్తిడిని గణనీయంగా తగ్గించగలిగాం. రోగి మరుసటి రోజే నడవడం ఈ విధాన విజయానికి నిదర్శనం" అని డా. నిసర్గ తెలిపారు.ఈ శస్త్రచికిత్స బృందంలో కార్డియాక్ సర్జన్ డా. వినీత్, కార్డియాక్ అనస్తీషియాలజిస్టులు డా. దివ్య, డా. గోరింత, డా. భవాని, సీనియర్ సర్జికల్ అసిస్టెంట్ మనోహ, సీనియర్ క్లినికల్ పెర్ఫ్యూషనిస్టులు దయాకర్ స్వామి, జగన్మోహన్, జూనియర్ పెర్ఫ్యూషనిస్ట్ అభిషేక్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో అత్యాధునిక రోబోటిక్ గుండె శస్త్రచికిత్సలకు కిమ్స్ గచ్చిబౌలి కేంద్రంగా ఎదుగుతోందని, రోగులకు ప్రపంచ స్థాయి మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు.



# హెపటైటిస్ నుండి లివర్ క్యాన్సర్ వరకు: ముందుగా గుర్తించండి.. త్వరగా చికిత్స చేయండి


వైరల్ హెపటైటిస్ అనేది కేవలం కాలేయ ఇన్‌ఫెక్షన్ మాత్రమే కాదు. ఇది మనం ఈరోజు చికిత్స చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్‌లలో ఒకటైన హెపటోసెల్యులర్ కార్సినోమా లేదా ప్రైమరీ లివర్ క్యాన్సర్‌కు ప్రధాన కారణం. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా, ఈ నిశ్శబ్ద సంబంధాన్ని నొక్కి చెప్పడం చాలా అవసరమని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ & రోబోటిక్ సర్జన్ డాక్టర్ అజయ్ వరుణ్ రెడ్డి వివరించారు. దీర్ఘకాలిక హెపటైటిస్ బి, సి ఇన్‌ఫెక్షన్లు ప్రపంచవ్యాప్తంగా 80% కంటే ఎక్కువ కాలేయ క్యాన్సర్ కేసులకు కారణమవుతున్నాయి. భారతదేశంలో 5 కోట్ల మందికి పైగా హెపటైటిస్ బి లేదా సితో జీవిస్తున్నారు. ఇక్కడ లివర్ క్యాన్సర్ తరచుగా గుర్తించబడకుండా, చికిత్సకు వీలుకాని దశకు చేరుకునే వరకు బయటపడదు. విచిత్రం ఏమిటంటే, సరైన సమయంలో గుర్తిస్తే ఈ కేసులలో చాలా వరకు నివారించవచ్చు. లేదా చికిత్స అందించడం ద్వారా నయం చేయొచ్చు.




**స్క్రీనింగ్ ఎందుకు అవసరం?**

మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో, నిజామాబాద్‌కు చెందిన 56 ఏళ్ల వ్యక్తి ఇటీవల పొత్తికడుపు పైభాగంలో నొప్పి రావడంతో మా వద్దకు వచ్చారు. ఇమేజింగ్ పరీక్షల్లో కాలేయంలో పెద్ద కణితి ఉన్నట్లు తేలింది. తదుపరి పరీక్షల్లో అది హెపటోసెల్యులర్ కార్సినోమా అని నిర్ధారణ అయ్యింది. రక్తాన్ని పరిశీలించగా, అతనికి 20 ఏళ్లకు పైగా హెపటైటిస్ బి ఉందని, అది ఎప్పుడూ నిర్ధారణ కాలేదని, చికిత్స చేయలేదని వెల్లడైంది. ఒకవేళ పదేళ్ల క్రితమే అతని హెపటైటిస్‌ని స్క్రీనింగ్ చేసి ఉంటే, యాంటీవైరల్ చికిత్స అతని క్యాన్సర్ ప్రమాదాన్ని దాదాపు 80% తగ్గించి ఉండేది. ఈ వ్యత్యాసాన్ని మనం పూడ్చాలి. ఈరోజు HBV, HCV లు చికిత్స చేయదగినవి. కొత్త యాంటీవైరల్ చికిత్సలతో, రోగులు వైరస్‌ను అణచివేయవచ్చు. కాలేయ వాపును తగ్గించవచ్చు, క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అయితే ముందుగానే గుర్తించడం అవసరం. మెడికవర్ ఇప్పుడు ప్రతి మాస్టర్ హెల్త్ చెక్, OPD మూల్యాంకనం, అధిక ప్రమాదకర రోగుల ప్రొఫైల్‌లో దీన్ని అనుసంధానిస్తోంది.

కాలేయ క్యాన్సర్ చాలా తీవ్రమైనది, కానీ హెపటైటిస్ స్క్రీనింగ్‌తో ఇది నివారించదగినదిగా మారుతుంది. మెడికవర్ బృందాలు ఆంకాలజీ, హెపటాలజీ, డయాగ్నోస్టిక్స్‌లో ఉన్న






నిపుణులతో కలిసి ఈ వ్యాధిని మూలంలోనే గుర్తించే నైపుణ్యం కలిగి ఉన్నాయి. ఈ హెపటైటిస్ దినోత్సవం నాడు చివరి దశ చికిత్స నుండి ముందుగానే నివారణకు మన దృష్టిని మారుద్దాం. ఎందుకంటే కాలేయ క్యాన్సర్‌పై హెపటైటిస్ పట్ల అవగాహన, చర్యతోనే మొదలవుతుంది.

# ఉత్తరాంధ్ర... ఇకపై ఉత్తమ ఆంధ్ర




**మొదటిపేజీ తరువాయి**

విజయనగరం జిల్లా భోగాపురంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులే ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారమని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి పెట్టడం గర్వకారణమన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన జీఎంఆర్ సంస్థ నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రాంత సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోందన్నారు. ఈ ప్రాజెక్టుకు పునాది వేసిన మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ప్రస్తుతం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇద్దరూ ఉత్తరాంధ్ర వారేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సముద్రం, కొండల నడుమ నిర్మితమైన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతుందని చెప్పారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మిస్తున్నామని, శంషాబాద్ విమానాశ్రయం తెలంగాణ రూపురేఖలు మార్చినట్లే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర దశ, దిశను మార్చబోతోందని ముఖ్యమంత్రి అన్నారు.

**ఉత్తరాంధ్రకే వలస వచ్చే రోజులొచ్చాయి**

ప్రధాని మోదీ సహకారంతో... కేంద్రం అందిస్తున్న తోడ్పాటుతో గత రెండేళ్లలో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించామని, వాటి ద్వారా 5.57 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు సెంటిమెంట్ నిలబెట్టింది ప్రధాని నరేంద్ర మోదీనేనని చెప్పారు. అలాగే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రత్యేక ఆర్థిక వెసులుబాటు కలిగించి...స్టీల్ ప్లాంట్ పునర్ వైభవం సాధించేలా ప్రధాని సహకరిస్తున్నారని సీఎం తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని సహకరించారన్నారు. మూడేళ్లలో రూ.2,784 కోట్లతో 8 సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి అనుమతులు వచ్చాయని... దానికి నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 14న గోదావరి నీటిని అనకాపల్లికి తీసుకువస్తామని, వంశధార-గోదావరి అనుసంధానం కూడా చేపడతామని వెల్లడించారు. పర్యాటకం, ఫార్మా, రేర్ ఎర్త్ ఖనిజాలు, జాతీయ రహదారులు, ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉత్తరాంధ్ర కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి మారి, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే రోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ప్రధాని చేతుల మీదుగానే పోలవరం... అమరావతి

విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, పోలవరం, అమరావతికి కేంద్ర సహకారం అందించిన ప్రధాని మోదీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2027 నాటికి పోలవరం పూర్తిచేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, అలాగే 2028 నాటికి అమరావతి తొలి దశను పూర్తి చేసి ప్రధానితో ప్రారంభింపచేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. ఒకప్పుడు "ఎర్రబస్సే రాదు" అని వెక్కిరించిన చోట నేడు ప్రపంచస్థాయి ఎయిర్‌బస్ దిగుతోందని, అభివృద్ధిని అడ్డుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారని వ్యాఖ్యానించారు.

**మోదీ విధానం 'నేషన్ ఫస్ట్'**

ప్రపంచం ఐటీ నుంచి ఏఐ వైపు అడుగులు వేస్తున్న సమయంలో దేశానికి ప్రధాని మోదీ లాంటి సమర్థ నాయకుడు అవసరం ఉందని సీఎం అన్నారు. డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను నాలుగో స్థానానికి తీసుకొచ్చారని కొనియాడారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన నాయకుడు మోదీనేనని అన్నారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతన్న యుద్ధాల వల్ల భారత దేశంపై ఆ ప్రభావం పడకుండా చూడడంలో ప్రధాని మోదీ సక్సెస్ అయ్యారని గుర్తు చేశారు. వివిధ దేశాల ప్రజలు సరైన నాయకత్వం కోసం.. సరైన నాయకుడు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో... భారత దేశానికి మోదీ రూపంలో అద్భుతమైన నాయకత్వం లభించిందని... ఇది దేశ ప్రజల అదృష్టమన్నారు. క్లిష్ట కాలంలో కూడా 144 కోట్ల భారత ప్రజల ఆశలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ ఒక్కరి వల్లే సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. మోదీని విమర్శించే వారికి కూడా ఆయన చేసిన మంచి... దేశానికి చేసిన సేవలు తెలుసని చెప్పారు. ప్రధాని మోదీకి దేశ ప్రజలందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో నరేంద్ర మోదీ వంటి నాయకుణ్ని చూడలేదని, "రైట్ టైమ్... రైట్ ప్లేస్... రైట్ మ్యాన్" మోదీయేనని వ్యాఖ్యానించారు.

**ఎయిర్ పోర్ట్ టెర్మినల్లో కళాకృతులను ఆసక్తిగా తిలకించిన ప్రధాని**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించిన అనంతరం చెక్‌ఇన్ హాల్, ఆధునిక ప్రయాణికుల సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలను పరిశీలించారు. విమానాశ్రయ మాస్టర్ ప్లాన్, ఏవియేషన్ హబ్, ఏవియేషన్ ఎడ్యుసిటీ నమూనాలను జీఎంఆర్ ప్రతినిధులు వివరించారు. టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన భారీ వీడియో వాల్‌లో ప్రదర్శించిన ఉత్తరాంధ్ర చరిత్ర, ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రికి వివరించారు. విమానాశ్రయ ప్రాంగణంలోని తెలుగు కళా సంపదను ప్రతిబింబించే కళాఖండాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. టెర్మినల్ నుంచి ఓపెన్‌టాప్ జీపులో సభా వేదికకు చేరుకునే మార్గం మధ్యలో గిరిజన మహిళలు.. విద్యార్థినులు చేసిన థింసా నృత్యంతో ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగత పలికారు. సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రధానమంత్రికి ప్రజలు జాతీయ జెండాలు ఊపుతూ కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. సభా వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొందూరు ఖాదీ శాలువాతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఘనంగా సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కలిసి ఉత్తరాంధ్ర కళా వైభవానికి ప్రతీక అయిన బొబ్బిలి వీణను ప్రధానమంత్రికి జ్ఞాపికగా అందజేశారు. ఓపెన్ టాప్ జీపులో ప్రధాని మోదీ వెంట ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉన్నారు. వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**చంద్రబాబు కృషితోనే ఏపీకి పెట్టుబడుల వెల్లువ: ప్రధాని ప్రశంసలు**

రాత్రింబవళ్లు కష్టపడి పరిశ్రమలను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి ఫలితంగానే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ప్రధాని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ సర్కార్‌లో కీలక భాగస్వాములుగా ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పెట్టుబడులు-ఉపాధి-అభివృద్ధి అనే లక్ష్యంతోనే ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని, ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు పెరుగుతాయని, ఎగుమతులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, చివరికి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అదే అభివృద్ధి నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ప్రధాని మోదీ ప్రశంసించారు.

# ఎర్రబస్సు రాదన్న చోటకు ఎయిర్ బస్సు వచ్చింది

**విశాఖపట్నం ఆగస్ట్ 01 అనంత జనశక్తి న్యూస్**

కొందరు ఎర్రబస్సు రాని ఊరికి విమానాశ్రయం అవసరమా అని అన్నారు. ఉత్తరాంధ్రను తక్కువగా అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వాళ్లకి ఈరోజు దిమ్మ తిరిగే సమాధానమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఎయిర్ పోర్ట్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్నచోటకి ఎయిర్ బస్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఏకంగా మన నమో వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ--- అర్ధమైందా రాజా..` అంటూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తేజభరితంగా ప్రసంగించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

**ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చిన నమో**

ఎయిర్ పోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరుడు అల్లూరి సీతా రామరాజు నడయాడిన గొప్ప నేల ఉత్తరాంధ్ర. ఈ రోజు నుంచి ఈ నేల చరిత్ర, పౌరుషం గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది.

ఈ రోజు కేవలం ఒక ఎయిర్ పోర్ట్ ప్రారంభం మాత్రమే కాదు. మన నమో వికసిత్ భారత్, మన సీబీఎన్ విజన్ కలిసిన రోజు. ఉత్తరాంధ్ర భవిష్యత్తు మారే రోజు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకెళ్లే రోజు. ఈనేలపై స్వాతంత్ర్యం కోసం పోరాడింది అల్లూరి సీతారామ రాజు అయితే ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు ఇచ్చింది మన నమో. రైతుల త్యాగం, కార్మిక కష్టం, మన సీబీఎన్ విజన్‌కు ప్రతిరూపం ఈ విమానాశ్రయం. అల్లూరి సీతా రామరాజు కి ఉన్న పట్టుదల, పౌరుషం, దేశ భక్తి నాకు మన నమోలో కనిపిస్తుంది. నమో అంటే ధైర్యం, నమో అంటే విశ్వాసం, నమో అంటే సురక్షిత భారత్. నమో అంటే శత్రువు గుండెల్లో భయం, అభివృద్ధి, పేదల సంక్షేమం, భవిష్యత్తుకు భరోసా కోరుకునే వారికి ఒకే ఒక సమాధానం నమో.



# నాలో ఆత్మవిశ్వాసం నింపిన క్షణం

తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అంటోంది అందాల తార ప్రీతి ముకుందన్. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళి'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. "మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదు?' అని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టాన"ని అంది.



# టీజర్ వచ్చేది ఆ రోజే

అగ్ర హీరో నాని నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్న ఈచిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. నిర్మాణం తుది దశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈ నెల 6న ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 1నిమిషం 35సెకన్ల నిడివి గల ఈ టీజర్ 'ది ప్యారడైజ్' ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నదని, కథలోని భావోద్వేగాల తీవ్రతను చూపించబోతున్నదని మేకర్స్ తెలిపారు. రాఘవ్ జుయాల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్‌బాబు, తనికెళ్ల భరణి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈచిత్రానికి కెమెరా: సీహెచ్ బాబు, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాణం: ఎస్వీఎల్ సినిమా.



# రేణు దేశాయ్ సెకండ్ ఇన్నింగ్స్



ఒకప్పుడు నటిగా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న రేణు దేశాయ్ చాలా కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్నారు. దర్శకత్వం, రచన, సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించిన ఆమె.. ఇటీవల 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాతో నటిగా రీఎంట్రీ ఇచ్చారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె పునరాగమనం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. అయినా నటనపై ఉన్న ఆసక్తిని మాత్రం రేణు దేశాయ్ తగ్గించుకోలేదు. రొటీన్ కమర్షియల్ పాత్రల కంటే నటిగా తన ప్రతిభను చాటుకునే బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకోవాలనే ఆలోచనతో ఆమె ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రేణు దేశాయ్ తదుపరి ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ఓంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో లెజెండరీ నటుడు మమ్ముట్టి కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. అందులో మమ్ముట్టికి జోడీగా రేణు దేశాయ్ కనిపించనున్నారనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పేరుకు మాత్రమే పరిమితం కాకుండా, కథను కీలక మలుపు తిప్పే భావోద్వేగభరితమైన పాత్రలో ఆమె కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో కంటెంట్ ఆధారిత చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తోంది. అలాంటి సమయంలో గ్లామర్ పాత్రల కంటే నటనకు అవకాశం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకోవడం ద్వారా రేణు దేశాయ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను భిన్నంగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# నీట్ పేపర్ లీక్ వల్ల సర్వస్వాన్ని కోల్పోయాను



మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ అవ్వడం వలన పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. సోహా అలీ ఖాన్ నిర్వహించిన 'ఆల్ అబౌట్ హర్' యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, 2015 నాటి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్ ఉదంతం తనపై ఎంత తీవ్రమైన మానసిక ప్రభావాన్ని చూపిందో వివరించారు. ఎంతో కష్టపడి ప్రిపేర్ అయిన తర్వాత పరీక్ష రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన కాలమని ఆమె తెలిపారు. వైద్య వృత్తిపై మక్కువతో తాను ఎంతో ఇష్టపడే కూచిపూడి నృత్యం, పెయింటింగ్ వంటి వాటిని ఒక సంవత్సర కాలం పాటు పూర్తిగా పక్కన పెట్టానని, తన సంతోషాలన్నింటినీ త్యాగం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లు కావడంతో మానసికంగా తనకు ఎంతో అండగా నిలిచారని, అయితే సాధారణ విద్యార్థులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని మానుషి వెల్లడించారు. ఎంతోమంది విద్యార్థులు కోచింగ్ కోసం అప్పులు చేసి, వేరే నగరాలకు వెళ్లి చదువుకుంటున్నారని, అలాంటి సమయంలో పరీక్ష మళ్లీ రాయాల్సి రావడం వల్ల విద్యార్థులు ఎంతటి మానసిక ఒత్తిడికి గురవుతారో మాటల్లో చెప్పలేమని అన్నారు. పరీక్ష తేదీ పొడిగించిన ఆ 45 రోజులు మరింత కష్టంగా మారిందని, ఇంకెంత శక్తి మిగిలి ఉందో అనిపించేదని ఆమె గుర్తుచేసుకున్నారు.

# భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ భారత్‌కు సారథి అవుతాడేమో: ఈస్ట్‌జోన్ సెలక్టర్




వచ్చే దులీప్ ట్రోఫీ కోసం ఈస్ట్‌జోన్ జట్టుకు వైభవ్ సూర్యవంశీ ని వైస్ కెప్టెన్‌గా ప్రకటించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అప్పడే కుర్రాడికి ఇలాంటి అదనపు బాధ్యతలు అవసరమా? అని వ్యాఖ్యలు వినిపించాయి. మరోవైపు వైభవ్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంకా నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయనేది పలువురి సూచన. ఈ క్రమంలో ఈస్ట్ జోన్ సెలక్టర్ ప్రవంజన్ స్పందించారు. తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ అనుభవంతో మరింత రాటుదేలతాడని వ్యాఖ్యానించారు.

"మేం వైభవ్ ను సారథి చేయలేదు. వైస్ కెప్టెన్‌గా నియమించాం. మా జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్. వికెట్ కీపర్ కూడా. రోజంతా యాక్టివ్‌గా ఉంటాడు. అంతేకానీ, వైభవ్ సారథ్యం నిర్వర్తించడు. అతడు రోజురోజుకూ పరిణతి చెందుతున్నాడు. ఇలాంటి బాధ్యతలు.. భవిష్యత్తులో అతడికి హెల్ప్ అవుతాయి. వైస్ కెప్టెన్సీ రావడం గొప్ప అవకాశం. దేశం కోసమూ అద్భుతంగా ఆడాలని అతడు కోరుకుంటున్నాడు. ప్రస్తుతం కుర్రాళ్లకు బాధ్యతలు ఇవ్వడాన్ని అత్యంత ముఖ్యమని మేం భావించాం. భవిష్యత్తులో అతడు ఏదో ఒక రోజు టీమ్‌ఇండియాకు కెప్టెన్ అవ్వచ్చేమో" అని ప్రవంజన్ వెల్లడించారు.

కలిసి కట్టుగా నిర్ణయం తీసుకున్నాం..

"ఐపీఎల్‌తోపాటు ఇటీవల భారత జట్టు తరపున వైభవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. దేశవాళీలోనూ బిహార్ జట్టుకు వైస్ కెప్టెన్సీని నిర్వర్తించాడు. వైభవ్‌ను నియమించాలని కమిటీ అంతా కలిసి కట్టుగా నిర్ణయం తీసుకుంది. బయట నుంచి ఎవరికి తోచిన విధంగా వారు కామెంట్లు చేస్తున్నారు. అందరూ ఒకేలా ఆలోచించలేరు.

# బుమ్రా ఫిట్


బెంగళూరు: ఇంగ్లండ్ పర్యటనలో గాయపడ్డ భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూరులోని సీవోఈలో నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో బుమ్రా పాసయ్యాడని, ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరుగబోయే రెండు మ్యాచ్‌ల సిరీస్ కోసం అతడు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్స్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భారత్ ఫైనల్ చేరాలంటే తర్వాత ఆడబోయే 9 టెస్టుల్లో ఏడు నెగ్గాల్సిన నేపథ్యంలో లంక సిరీస్‌కు బుమ్రాను ఆడించనున్నారు.



# జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు సిల్వర్

భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

గ్లాస్‌గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.



# కామన్వెల్త్‌లో భారత్‌కు ఒక్క రోజే 25 పతకాల ఛాన్స్

కామన్వెల్త్ గేమ్స్‌లో ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇవాళ ఒక్క రోజు మరో లెక్క. ప్రస్తుతం భారత ఖాతాలో 23 పతకాలు చేరాయి. ఇందులో ఐదు బంగారు, 12 రజతాలు, ఆరు కాంస్యాలు ఉన్నాయి. పట్టికలో పదో స్థానంలో కొనసాగుతోంది. తన స్థానంతోపాటు పతకాల సంఖ్యను గణనీయంగా మెరుగుపర్చుకునే అవకాశం ఉంది. ఇప్పటికే పది మంది బాక్సర్లు ఫైనల్‌కు చేరి స్వర్ణాలపై గురి పెట్టారు. ఇవే కాకుండా మరో 15 పతకాలు భారత ఖాతాలో పడే అవకాశం ఉంది. దీంతో మెడల్స్ టాలీలో భారత్ టాప్-5కి కూడా దూసుకుపోవచ్చు. కామన్వెల్త్ గేమ్స్ ఆగస్టు 2తో (భారత కాలమానం ప్రకారం ఆగస్టు 3 ఉదయం) ముగుస్తాయి.

అథ్లెటిక్స్ (8 మెడల్స్)
పురుషుల ట్రిపుల్ జంప్ ఫైనల్ (2 మెడల్స్): ప్రవీణ్ చిత్రావెల్, సెల్వ ప్రభు తిరుమరన్
మహిళల 10వేల మీటర్ల రేస్ వాక్ ఫైనల్ (2): ప్రియాంకా గోస్వామి, రవీనా గైక్వాడ్
పురుషుల పోల్ వాల్ట్ ఫైనల్ (2): దేవ్ కుమార్ మీనా, కుల్‌దీప్ కుమార్
పురుషుల 5వేల మీటర్లు వాక్ ఫైనల్ (1): గుల్వీర్ సింగ్
మిక్స్‌డ్ 4X400 మీ. రిలే ఫైనల్ (1)
పారా అథ్లెటిక్స్ (3 మెడల్స్)
పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 ఫైనల్ (2): సోమన్ రానా, శుభ్‌మ్ జుయల్
పురుషుల 1500 మీ. టీ54 ఫైనల్ (1): రమేశ్ షణ్ముగం
బాక్సింగ్ (10 మెడల్స్-ఫైనల్స్)
మహిళల 54 కేజీల విభాగం: ప్రీతి
మహిళల 57 కేజీల విభాగం: జాస్మిన్
పురుషుల 55 కేజీల విభాగం: జాదుమణి
మహిళల 51 కేజీల విభాగం: సాక్షి
మహిళల 60 కేజీల విభాగం: ప్రియా
మహిళల 70 కేజీల విభాగం: లోవ్లీనా
పురుషుల 60 కేజీల విభాగం: సచిన్
పురుషుల 80 కేజీల విభాగం: అంకుష్ పంఘాల్
పురుషుల 90 కేజీల+ విభాగం: నరేందర్
జూడో (4 మెడల్స్)..
మహిళల 63 కేజీల విభాగం రౌండ్16: ఉన్నతి శర్మ
పురుషుల 90 కేజీల విభాగం రౌండ్16: కరంజిత్ సింగ్ మాన్
పురుషుల 81 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్: హర్ష్ టోకస్
మహిళల 70 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్: ఇనుంగన్బి తఖెల్లాంబమ్

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945